సాక్షి
ఒడిశా
గురువారం । 31 । ఆగస్టు । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.3,85,565
బంగారం	5 గ్రాముల 340 మిల్లీ గ్రాములు
వెండి	14 గ్రాముల 450 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



రెండు మావో డంప్‌లు స్వాధీనం

మల్కన్‌గిరి జిల్లాలోని కలిమెల సమితి, చిత్రకొం డ సమితుల్లో బీఎస్‌ఎఫ్ జవాన్లు మావోయిస్టులు అమర్చిన రెండు డంప్‌లను వెలికితీశారు. ఈ సందర్భంగా వాటిలో ఉన్నటువంటి సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

- 8లో

అర్ధరాత్రి ఆస్పత్రిలో ఆకస్మిక తనిఖీలు



కొరాపుట్ జిల్లా కేంద్రంలోని సాహిద్ లక్ష్మణ్ నాయక్ ప్రభుత్వ వైద్య కళాశాలలో కలెక్టర్ అబ్దుల్ మహ్మద్ అక్తర్ మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. వరుసగా వివిధ బ్లాక్‌ల పరిశీలన చేపట్టారు.

- 8లో

న్యూస్‌రీల్

ఆదర్శనీయుడు బినాయక్ ఆచార్య



దివంగత ముఖ్యమంత్రి బినాయక్ ఆచార్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

బరంపురం: యువతకు దివంగత ముఖ్యమంత్రి బినాయక్ ఆచార్య ఆదర్శనీయుడని వక్తలు పేర్కొన్నారు. స్థానిక అస్కా రోడ్‌లోని బినాయక్ ఆచార్య కళాశాల ప్రాంగణంలో కళాశాల పాలన యంత్రాంగం ఆధ్వర్యంలో బినాయక్ అచార్య 106వ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బరంపురం ఎంపీ చంద్రశేఖర్ సాహు హాజరై బినాయక్ ఆచార్య విగ్రహానికి పులమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్రానికి బినాయక్ ఆచార్య చేసిన సేవలు మరువలేనివన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాజధాని కళాశాల ప్రొఫెసర్ డా.దేబశీశ్ పాత్రో, ప్రిన్సిపాల్ సూర్య నారాయణ సాహు, కన్ను చరణ్, అధ్యాపకులు సుశాంత్ కుమార్ పరిడా తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రైలు సేవలు యథాతథం

భువనేశ్వర్: ఖుర్దా రోడ్–బారంగ్ 3వ లైన్ ప్రాజెక్టు పనులు పూర్తయ్యాయి. దీనిలో భాగమైన మంచేశ్వర్ మరియు భువనేశ్వర్ మధ్య బుధవారం చివరి దశ సిగ్నలింగ్ పనులను రైల్వే భద్రతా కమిషనర్ (సీఆర్‌ఎస్) పరిశీలన ముగియడంతో భువనేశ్వర్ ప్రాంతంలో రైలు సేవలు గురువారం నుంచి యథాతథంగా పునరుద్ధరించబడతాయని తూర్పు కోస్తా రైల్వే ప్రకటించింది. తూర్పు కోస్తా రైల్వేజోన్ వ్యాప్తంగా వివిధ ప్రదేశాల్లో ప్రధాన మౌలిక సదుపాయాలు మరియు భద్రతకు సంబంధించిన పనులు భారీ ఎత్తున చేపట్టారు. ఆగస్టు 12 నుంచి ప్రారంభమై 30 వరకు ఈ పనులు నిరవధికంగా కొనసాగించారు. ఈ పనులు పూర్తవ్వడంతో పాక్షికంగా ప్రభావితమైన రైలు సేవలను పునరుద్ధరించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. భువనేశ్వర్ మరియు మంచేశ్వర్ మధ్య 3వ లైన్ నిర్మాణంతో మంచేశ్వర్ రైల్వే స్టేషన్ లేఅవుట్‌లో పెద్ద మార్పులు చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో భువనేశ్వర్ రైల్వే స్టేషన్‌లో సిగ్నలింగ్ వ్యవస్థ భారీగా పునర్వ్యవస్థీకరించారు.

బాలాజీ ఆలయంలో చోరీ



రహదారిపై దుండగులు వదిలి వెళ్లిన హుండీ

కొరాపుట్: జిల్లా కేంద్రంలోని తిరుపతి బాలాజీ మందిరంలో హుండీలు చోరికి గురయ్యాయి. కేసు వివరాలను పట్టణ పోలీసులు బుధవారం వెల్లడించారు. ఆర్టీవో కార్యాలయం వెనుక ఉన్న తిరుపతి బాలాజీ మందిరంలో దొంగలు ప్రవేశించారు. ఆలయంలో మూడు హుండీలు ఉండగా, వాటిని పగలుగొట్టి నగదు తీసేందుకు ప్రయత్నం చేశారు. వాటిలో రెండు హుండీల తాళాలు పగటుగొట్టి నగదు దొంగలించిన దుండగులు, ఒక హుండీ తాళం తెరవలేక అపహరించుకుపోయారు. అనంతరం హుండీని కొరాపుట్–జయపురం జాతీయ రహదారి మీద బట్ట మంగళ దేవాలయం ప్రాంతంలో వదలి పారిపోయారు. ఇది గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మరోవైపు బాలాజీ మందిరం పక్కనే ఉన్న కన్యకా పరమేశ్వరి దేవాలయంలోని హుండీలో ముందు రోజు చోరీ జరిగింది. ఆ దేవాలయ కమిటీ వారు పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడంతో రెండో రోజు బాలాజీ మందిరంలో దొంగతనంకి దిగారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


అడవిలోకి ఎలుగు



ఎలుగును అడవిలోకి విడిచిపెడుతున్న దృశ్యం

జయపురం: ఈనెల 25వ తేదీన బొయిపరిగుడ సమితి ఖెందుగుడ గ్రామ పంచాయతీ బొడొనాయిక్‌గుడ ప్రాథమిక పాఠశాలలోకి ఎలుగు ప్రవేశించిన విషయం తెలిసిందే. తీవ్ర ఆస్వస్థతతో ఉన్న ఆ ఎలుగుకు వైద్యం చేయించిన అనంతరం బుధవారం అడవిలో విడిచిపెట్టినట్లు అటవీ అధికారులు వెల్లడించారు. ఐదురోజుల పాటు ఎలుగుకు చికిత్స అందజేశామని, అనంతరం మంత్రిఅంబ అడవిలో విడిచిపెట్టినట్లు పేర్కొన్నారు.

అన్నా చెల్లెల అనుబంధం



భువనేశ్వర్: పూరీ తీరంలో చందమామకు పుడమి తల్లి రాఖీ కడుతున్నట్లు రూపుదిద్దుకున్న సైకత శిల్పం

కాలం మారినా.. దూరం పెరిగినా చెరగని బంధం అన్నా చెల్లెల అనుబంధం. అన్నా చెల్లెలు, అక్కా తమ్ముళ్ల ఆప్యాయత, అనురాగాలకు ప్రతీక రాఖీ పండగ. తమకు ఎల్లప్పుడూ రక్షణగా ఉండాలని, కష్టాల్లో తోడుగా ఉండాలని ఆడపడుచులు రాఖీ కట్టడం ఆనవాయితీ. అలాంటి రాఖీ పండగను రాష్ట్ర వ్యాప్తంగా పలుచోట్ల బుధవారం ఘనంగా నిర్వహించారు. మహిళలంతా సోదర సమానులకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు.

– సాక్షి నెట్‌వర్క్



కొరాపుట్: సంబల్‌పూర్ జిల్లాలో మొక్కలకు రాఖీలు కడుతున్న మహిళలు



భువనేశ్వర్: రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి రాఖీ కడుతున్న బ్రహ్మకుమారి సులోచన



పర్లాకిమిడి: నవజీవన్ అనాథాశ్రమంలో రాఖీలు కడుతున్న ఉపాధ్యాయులు



రాయగడ: సీఆర్పీఎఫ్ జవాన్లకు రాఖీలు కడుతున్న విద్యార్థినులు



భువనేశ్వర్: గవర్నర్ చేతికి రాఖీ కడుతున్న పాఠశాల విద్యార్థినులు



బరంపురం: సరస్వతీ శిశు మందిర్‌లో విద్యార్థులకు రాఖీలు కడుతున్న తోటి విద్యార్థినులు



పర్లాకిమిడి: జైలు సూపరింటెండెంట్‌కు రాఖీ కడుతున్న ఉపాధ్యాయురాలు



భువనేశ్వర్: చిన్నారి చేతికి రాఖీ కడుతున్న గవర్నర్ ప్రొఫెసర్ గణేషీ లాల్

‘సమస్యలు పరిష్కరించండి’



ఎంపీ సప్తగిరి ఉల్కతో చర్చిస్తున్న ప్రమోద్ మహంతి తదితరులు

జయపురం: స్థానిక గగణాపూర్ సేవా పేపర్ మిల్లులో పనిచేస్తున్న కార్మికులు, విశ్రాంత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని శ్రామికులు, విశ్రాంత శ్రామికుల అసోసియేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు కొరాపుట్ జిల్లా కలెక్టర్‌ను, కొరాపుట్ ఎంపీని బుధవారం వేర్వేరుగా కలిసి సమస్యలు విన్నవించారు. పేపరు మిల్లు గత 45 రోజులుగా మూతబడిందని కార్మిక సంఘం అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ మహంతి తెలియజేశారు. వెంటనే మిల్లు తెరిచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మిల్లులో పనిచేస్తున్న శ్రామికులకు నాలుగు నెలలుగా జీతాలు చెల్లించడం లేదని, అలాగే 5 నెలల నుంచి కాంట్రాక్ట్ కార్మికులు, సెక్యూరిటీ సిబ్బందికి జీతాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. మిల్లు ఎప్పుడు నడుస్తుందో స్పష్టంగా యాజమాన్యం చెప్పటం లేదని, బకాయలు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు కలప సరఫరా చేయటం లేదని పేర్కొన్నారు. దీంతో కలెక్టర్ స్పందించి రాష్ట్ర కార్మిక విభాగ కార్యదర్శి, రాష్ట్ర పరిశ్రమల విభాగ కార్యదర్శులకు సమస్యను తెలియజేయడానికి కృషి చేస్తానన్నారు. ఎంపీ సప్తగిరి ఉల్క మాట్లాడుతూ.. కేంద్ర కార్మిక మంత్రి భూపేంద్ర యాదవ్‌తో చర్చించి వెంటనే సమస్యను పరిష్కరించేందుకు తగు చర్య తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో శ్రామిక నేతలు బనమాలి పాత్రో, నారాయణ దాస్, మురళీధర పాత్రో, ఉమాకాంత శతపతి, ప్రమోద్ తివారీ, కె.సత్యనారాయణ, అలేఖ్ పాత్రో, జయశంకర యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా బట్టీలపై దాడులు



కె.బిముపూర్ అటవీ ప్రాంతంలో నాటుసారా బట్టీలపై దాడులు నిర్వహిస్తున్న పోలీసులు

బరంపురం: దిగపండి బ్లాక్ శివారు అటవీ ప్రాంతంలో అక్రమంగా తయారు చేస్తున్న నాటుసారా బట్టీలపై పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. ఏఎస్‌డీపీవో ఎస్.ఎస్.మహాపాత్రో తెలిపిన వివరాల మేరకు.. గంజాం జిల్లా దిగపండి పోలీసు స్టేషన్ పరిధి కె.బిముపూర్, రాజ్‌పూర్ అటవీ ప్రాంతాల్లో అక్రమంగా నాటుసారా తయారు చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో సారా బట్టీలపై దాడులు చేసి 2000 లీటర్ల నాటుసారా, విప్పపూలు, నల్లబెల్లం ఊటను ధ్వంసం చేశారు. మరో 420 లీటర్ల నాటుసారా మరియు డ్రమ్ములు, పైప్‌లు వంటి సామగ్రీ స్వాధీనం చేసుకొని, ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు.



అరెస్టు చేసిన వ్యక్తులు, సామగ్రిని చూపిస్తున్న పోలీసులు

పోలీసులే అపహరించారు

• ప్రఫుల్ల సామంతరాయ్ వెల్లడి

రాయగడ: తనని అపహరించింది పోలీసులేనని లోక్‌శక్తి అభిజాన్ జాతీయ ముఖ్య సలహాదారుడు, స్వాభిమాన్ పత్రిక సంపాదకుడు ప్రఫుల్ల సామంత రాయ్ వెల్లడించారు. మంగళవారం అపహరణకు గురైన అతడిని కొంతమంది బరంపురంలోని తన నివాసంలో విడిచిపెట్టి వెళ్లిపోయారు. ఈ సందర్భంగా తన అపహరణకు సంబంధించి వివరాలను ఒక ఛానల్‌కు వెల్లడించారు. ఒక కార్యక్రమంలో పాల్గొనేందుకు బరంపురం నుంచి రాయగడకు మంగళవారం ఉదయం వెళ్లినట్లు తెలియజేశారు. అక్కడ హోటల్‌లో ఉన్నటువంటి తన రూమ్‌కు మధ్యాహ్నం 3.30 గంటలకు నలుగురు వ్యక్తులు హఠాత్తుగా వచ్చి తన పేరు అడిగినట్లు చెప్పారు. ప్రఫుల్ల సామంతరాయ్ అని చెప్పడంతో మొబైల్ లాక్కొని స్విచ్ ఆఫ్ చేశారన్నారు. అనంతరం తన చేతులు, కాళ్లు కట్టేసి బలవంతంగా ఎత్తుకొని వెళ్లి హోటల్ బయట ఉన్నటువంటి కారులో కూర్చొబెట్టినట్లు తెలిపారు. ఆ సమయంలో హోటల్‌లో కాపాడమని అడిగినా ఎవరూ ముందుకు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కారులో కొంచెం దూరం వెళ్లిన తర్వాత దుండగులు తనకు కట్టిన తాళ్లను విప్పేసి, క్షమించమని అడిగారన్నారు. తమకు వచ్చిన ఆదేశాల మేరకు ఇలా చేయక తప్పలేదని అన్నారని తెలిపారు. అనంతరం రాత్రి 9.20 గంటల సమయంలో తనను బరంపురంలోని తన స్వగృహానికి తీసుకెళ్లి విడిచిపెట్టారన్నారు. ఇదంతా పథకం ప్రకారమే జరిగినట్లు తెలుస్తోందని పేర్కొన్నారు.

పోరాటం ఆగదు

జిల్లాలో కాసీపూర్ సమితి కుచేయిపాదొరా పంచాయతీలోని బొంతేసు, కుట్రింగమాలి, సిజామాలి తదితర ప్రాంతాల్లో ప్రకృతి సంపద నాశనం చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ప్రఫుల్ల సామంతరాయ్ ఆరోపించారు. ఆ ప్రాంత ప్రజల అనుమతి లేకుండా తవ్వకాలకు ఒక ప్రైవేటు సంస్థ సిద్ధపడుతోందని, ఎదురు తిరిగినవారిపై తప్పులు కేసులు నమోదు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజల తరుపున పోరాడేందుకు వచ్చిన తనను ఇలా నిర్బంధించడం విచారకరమన్నారు. ప్రతి మనిషికీ ప్రశ్నించే హక్కు ఉంటుందన్నారు. ప్రజల కోసం తన పోరాటం ఆగదని స్పష్టం చేశారు.



బరంపురంలోని తన స్వగృహం నుంచి మాట్లాడుతున్న ప్రఫుల్ల సామంతరాయ్

ముగిసిన బోల్‌భం భక్తుల సందడి



భక్తులు విడిచిన కావిళ్లను ట్రాక్టర్‌లో వేస్తున్న దృశ్యం



పారిశుద్ధ్య పనులు చేపడుతున్న జవాన్లు

జయపురం: ప్రసిద్ధ శివక్షేత్రం గుప్తేశ్వర్‌లో బోల్‌భం భక్తుల సందడి ముగిసింది. గత నెల రోజులుగా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారు. అయితే ప్రస్తుతం వేలాది మంది భక్తులు విడిచిన వ్యర్థ పదార్థాలు, బోల్ భం భక్తుల కావిడులు, కలశాలు, కాసాయ వస్త్రాలు, పూజా సామగ్రితో గుప్తేశ్వర్ నిండిపోయింది. అలాగే దుకాణాలు పారవేసిన వ్యర్థ పదార్థాలతో వాసన వెదజల్లుతోంది. దీంతో జయపురం సహజ్య హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ సభ్యులు వ్యర్థాలను తొలగించే కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. వారికి రామగిరి బీఎస్‌ఎఫ్ బెటాలియన్ జవాన్లు సహకరించారు. ట్రాక్టర్ల ద్వారా వ్యర్థాలను దూరంగా తరలించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.



వ్యర్థాలను తొలగిస్తున్న సహజ్య సంస్థ సభ్యులు



పేరుకుపోయిన చెత్త తీస్తున్న దృశ్యం

క్లుప్తంగా

లైంగికదాడి కేసులో 20 ఏళ్ల జైలుశిక్ష

సంతబొమ్మాళి: బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో మండలం కె.లింగుడు పంచాయతీ ఎం.సున్నాపల్లి గ్రామానికి చెందిన ఉప్పాడ సంతోష్ కుమార్‌కు 20 ఏళ్ల జైలు శిక్ష, రూ. 20వేలు జరిమానా, బాధిత కుటుంబానికి రూ.లక్ష ఇవ్వా లని శ్రీకాకుళం పోక్సో కోర్టు బుధవారం తీర్పునిచ్చింది. నౌపడ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. 2019 ఫిబ్రవరి 16న గ్రామానికి చెందిన ఓ బాలికపై సంతోష్ లైంగిక దాడికి పాల్పడినట్లు నౌపడ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. కోర్టులో విచారణ అనంతరం సంతోష్ కుమా ర్‌పై నేరం రుజువు కావడంతో శిక్ష విధించారు.

సజావుగా జాబ్‌మేళా



మాట్లాడుతున్న జిల్లా ఉపాధికల్పనాధికారి సుధ

శ్రీకాకుళం అర్బన్: జిల్లా నెహ్రూ యువజన కేంద్రం కార్యాలయంలో బుధవారం జాబ్ మేళా జరిగింది. కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా ఉపాధి కల్పనాధికారి కె.సుధ పాల్గొని మాట్లాడారు. జాబ్‌మేళాలో ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

హిరమండలం: వంశధార కుడి కాలువలో పడి గల్లంతైన పాతపట్నం మండలం సీది గ్రామానికి చెందిన ఎం.బాలకృష్ణ మృతదేహం బుధవారం లభ్యమైంది. ఓ శుభ కార్యానికి మంగళవారం హిరమండలం వచ్చిన బాలకృష్ణ కాలువలో స్నానానికి దిగి గల్లంతైపోయారు. మంగళవారం ఎంత వెతికినా ఆచూకీ దొరకలేదు. పోలీసులు గజ ఈతగాళ్లను తప్పించి కాలువలో ప్రవాహాన్ని తగ్గించి వెతకగా వంశధార కుడికాలువ వంతెనకు సమీపంలో ఆయన మృతదేహం లభ్యమైంది. దీంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. గ్రామంలో విషా ద ఛాయలు అలముకున్నాయి. ఎస్‌ఐ జి.నారాయణ స్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నలుగురు ఏఓలకు ఎంపీడీఓలుగా పదోన్నతులు

అరసవల్లి: పంచాయతీ రాజ్‌లో సీనియర్ పరిపాలనాధికారులుగా పనిచేస్తున్న నలుగురికి మండల పరిషత్ అభివృద్ధి అధికారులు (ఎంపీడీఓ)గా పదోన్నతులను కల్పిస్తూ పంచాయతీ రాజ్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు జిల్లా పరిషత్‌లో ఏఓలుగా పనిచేస్తున్న బి.బి.మిశ్రోకు బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు, ఎం.వి.రంగారావుకు అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఎంపీడీఓలుగా కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. అలాగే జిల్లా నీటి యాజమాన్య సంస్థలో ఏఓగా పనిచేస్తున్న కె.వి.ప్రసాద్‌కు బీఆర్ అంబేడ్కర్ కోన సీమ జిల్లాకు, నరసన్నపేట మండలపరిషత్ ఏఓగా పనిచేస్తున్న ఆర్.తిరుపతిరావుకు ఏ లూరు జిల్లాలో ఎంపీడీఓగా పదోన్నతి కల్పి స్తూ బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

మద్యానికి బానిసై.. ప్రాణాలు తీసుకున్నాడు

కోటబొమ్మాళి: స్థానిక మేజర్ పంచాయతీ ప్రకా షనగర్‌కాలనీకి చెందిన డబ్బీరు సాయికుమార్ (28) బుధవారం ఉదయం తన ఇంట్లోనే ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సాయికుమార్ చిన్నతనంలోనే తండ్రి నాగేశ్వరరావు మరణించడంతో తల్లి లక్ష్మితో కలిసి తన మేనమామ కృష్ణపాత్రుని వెంకటరావు ఇంటిలో ఉండేవాడు. యువకుడు ఐటీఐ వరకు చదివాడు. వ్యాన్ డ్రైవర్‌గా పని చేస్తుండేవాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసై డబ్బులు ఇవ్వాలని తరచూ తల్లి, మేనమామలను వేధిస్తుండేవాడు. మంగళవారం రాత్రి పూటుగా మద్యం సేవించి ఇంటి పక్కన గల పెంకుటింటిలో నిద్రపోయాడు. బుధవారం ఉదయం మేనమామ టీ ఇచ్చేందుకు తలపు తట్టగా తలుపు తీయకపోవడంతో అనుమానం వచ్చి పోలీసులకు తెలిపారు. వారు వచ్చి చూడగా సాయికుమార్ ఇంటిపైకప్పునకు ఉన్న దూలానికి చీరతో ఉరివేసుకుని కనిపించాడు. సాయి కుమార్ మృతితో కాలనీలో విషాద ఛాయలు నెలకొన్నాయి. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం పూర్తి చేసి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఎల్.ఎన్.పేట: మండలం సమీపంలోని బప్పడాం రోడ్డు వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇదే మండలం మోదుగువలస పునరావాస కాలనీకి జి.ప్రశాంత్ మృతి చెందారు. సరుబుజ్జిలి నుంచి ఎల్.ఎన్.పేట మండలం మోదుగువలస కాలనీకి తన ఆటోతో ప్రశాంత్ వస్తున్నాడు. బప్పడాం రోడ్డు సమీపంలోని కల్వర్టు వద్ద గోతిలోకి దిగిన ఆటోను అదుపులోకి తెచ్చే ప్రయత్నంలో బండి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోడ్రైవర్ ప్రసాద్ తలకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వటంతో 108 సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని బాధితుడిని శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతునికి భార్య, ఏడాదిన్నర వయసున్న కొడుకు ఉన్నారు. ఆటో బోల్తాపడిన సమయంలో ఆటోలో ప్రయాణికులు ఎవరూ లేకపోవటంతో ప్రమాదం తప్పింది. రోడ్డు ప్రమాదానికి సంబంధించి శ్రీకాకుళం ఔట్‌పోస్టు నుంచి ఫిర్యాదు వచ్చిందని సరుబుజ్జిలి పోలీసులు తెలిపారు.

ఘనంగా రాఖీ పూర్ణిమ



రాయగడ: జవాన్‌లకు రాఖీలు కడుతున్న బ్రహ్మ కుమారీలు

రాష్ట్రవ్యాప్తంగా బుధవారం ఘనంగా రాఖీ పూర్ణిమ నిర్వహించారు. ముందుగా శ్రీజగన్నాథ స్వామి ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు. తోబుట్టువులు అన్న, తమ్ముళ్లకు రాఖీలు కట్టి ఆశీర్వాదం పొందారు. వివిధ పాఠశాలల్లో విద్యార్థినులు విద్యార్థులకు రాఖీలు కట్టారు. అలాగే కార్యాలయాల్లో తోటి ఉద్యోగులకు మహిళా ఉద్యోగులు రాఖీలు కట్టి సోదరభావం చాటుకున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



రాయగడ: రాఖీలతో చిన్నారుల సందడి



బరంపురం: రాఖీలు కడుతున్న బ్రహ్మకుమారీలు



బరంపురం: రాఖీ పండగ జరుపుకుంటున్న మేయర్ సంఘమిత్ర తదితరులు



గణేష్ ఆలయంలో బీజేపీ నాయకులకు రాఖీలు కడుతున్న మహిళా మోర్చా నాయకులు



బరంపురం: గుసానినువాగాంలో ప్రత్యేక అలంకరణలో శ్రీజగన్నాథుడు, బలభద్ర, సుభద్రలు



పర్లాకిమిడి: రాఖీలు కడుతున్న సరస్వతీ శిశు మందిర్ విద్యార్థులు



కొరాపుట్: ఉమ్మర్ కోట్ పట్టణంలో పోలీసులకు రాఖీలు కడుతున్న విద్యార్థినులు



పర్లాకిమిడి: ఆదర్శ పోలీసుస్టేషన్ అధికారికి రాఖీలు కడుతున్న ఉపాధ్యాయులు



కొరాపుట్: ఎంపీ సప్తగిరి ఉల్కకు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీలు



పర్లాకిమిడి: ఉప కారాగారములో రక్షా బంధన్ వేడుకలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

జయపురం: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన ఘటన బొయిపరిగుడ సమితిలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. బసినిగుడ గ్రామానికి చెందిన కృష్ణ పొరజ బొయిపరిగుడలోని ఒక హార్డ్‌వేర్ దుకాణంలో పని చేస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం అతను భోజనం చేసేందుకు స్కూటీపై తన గ్రామానికి బయల్దేరాడు. మార్గమధ్యలో ఉద్దవ మఝి అనే వ్యక్తి కృష్ణ పొరజను ఆపి లిఫ్ట్ అడిగాడు. అతడిని ఎక్కించుకొని బసనిగుడ వెళ్తుండగా కుంద్ర మార్గంలో రావణపాడి కూడలి వద్ద స్కూటీ అదుపు తప్పి ఇద్దరూ కింద పడిపోయారు. ప్రమాదంలో ఇద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు వారిని చికిత్స నిమిత్తం బొయిపరిగుడ కమ్యూనిటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయితే వారిని పరీక్షించిన డాక్టర్లు అప్పటికే ఉద్దవ మఝి(25) మరణించినట్లు ధ్రువీకరించారు. తీవ్రగాయాలు పాలైన కృష్ణ పొరజ చికిత్స పొందుతున్నాడు. ప్రమాదం విషయం తెలిసిన బొయిపరిగుడ పోలీసు అధికారి సుశాంత కుమార్ శతపతి సంఘటన ప్రాంతానికి చేరుకొని దర్యాప్తు ప్రారంభించారు. ఉద్దవ మృతదేహానికి పోస్టుమార్టం జరిగిన తర్వాత బంధువులకు అప్పగిస్తామని వెల్లడించారు.



చికిత్స పొందుతున్న కృష్ణ పొరజ



ఆస్పత్రి వద్ద గుమిగూడిన గ్రామస్తులు

అర్ధరాత్రి ఆస్పత్రిలో ఆకస్మిక తనిఖీలు

- రోగులతో సంభాషించిన కలెక్టర్
- రికార్డుల పరిశీలన

కొరాపుట్: జిల్లా కేంద్రంలోని సాహిద్ లక్ష్మణ్ నాయక్ ప్రభుత్వ వైద్య కళాశాలలో కలెక్టర్ అబ్దుల్ మహ్మద్ అక్తర్ మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. వరుసగా వివిధ బ్లాక్‌లు పరిశీలన చేపట్టారు. చాలాసేపటి వరకు కలెక్టర్‌ను ఎవరూ గుర్తించలేదు. కొంత సమయానికి తెలిసినవారు కలెక్టర్‌కు నమస్కారాలు పెడుతుండడంతో సిబ్బంది ఉలిక్కిపడ్డారు. ఎవరో ముఖ్యమైన వ్యక్తి వచ్చారని గుర్తించి ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. కొంతసేపటికి కలెక్టర్‌గా ఖరారు చేసుకున్నారు. వెంటనే వివిధ విభాగాల అధికారులు ఉరుకులు పరుగుల మీద చేరుకున్నారు. కలెక్టర్ వివిధ బ్లాక్‌ల్లో రోగులతో నేరుగా సంభాషించారు. నర్సులను అడిగి డ్యూటీ చార్ట్‌లు పరిశీలించారు. అలాగే శిశు సంరక్షణ గదిలో సైతం తనికీలు చేపట్టారు. అంతకుముందు సాయంత్రం అస్పత్రి సమీపంలో 650 బెడ్స్ భవన నిర్మాణం పరిశీలించి వెళ్లిపోయారు. దీంతో కలెక్టర్ పర్యటన ముగిసిందని సిబ్బంది దీమాగా ఉన్నారు. కానీ ఆకస్మికంగా అర్ధరాత్రి వరకు రహస్య పరిశీలన చేయడం చర్చనీయాంశంగా మారింది.

5టీ కార్యదర్శి రాకకు సంకేతాలు..?

ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ వ్యక్తిగత సలహాదారుడు, 5టీ కార్యదర్శి కార్తికేయ పాండ్యన్ మరోసారి కొరాపుట్ జిల్లాకు విచ్చేస్తారని సంకేతాలు వస్తున్నాయి. పాండ్యన్ వస్తే తప్పనిసరిగా 650 బెడ్స్ ఆస్పత్రి నిర్మాణం పరిశీలిస్తారని, అందులో భాగంగా వైద్య కళాశాలకు సైతం వస్తారని అంచనాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో కలెక్టర్ పర్యటన జరిగినట్లు తెలుస్తోంది. ఆగస్టు 31న ఆయన కొరాపుట్ రావాల్సి ఉండగా పర్యటన రద్దయింది. ఇప్పుడు సెప్టెంబర్ మొదటి వారంలో రెండు రోజులు జిల్లాలో పర్యటిస్తారని అనుకుంటున్నారు.



శిశువుల వార్డు పరిశీలిస్తున్న కలెక్టర్ అక్తర్



బ్లాక్‌లో రికార్డులు పరిశీలిస్తున్న దృశ్యం



రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ అక్తర్

సెంట్రింగ్ కూలిన ఘటనపై దర్యాప్తు



గ్రామంలో దర్యాప్తు నిర్వహిస్తున్న అధికారులు

రాయగడ: జిల్లాలోని కల్యాణ సింగుపూర్ సమితి మజ్జిగుడ పంచాయతీ ఉపారొసాజ్జా గ్రామంలో రూరల్ డవలప్‌మెంట్ విభాగం స్పెషల్ సెక్రటరీ సుదర్శన్ పరిడ బుధవారం పర్యటించారు. జూలై 31వ తేదీన గ్రామంలోని ఒక కల్వర్టు నిర్మాణానికి సంబంధించి ఏర్పాటు చేసిన సెంట్రింగ్ కూలిన ఘటనలో ఐదుగురు మృతి చెందిన విషయం తెలిసిందే. దీనిపై దర్యాప్తు చేసేందుకు సోమవారం పరిడతో పాటు టెక్నికల్ బృందం ఆ గ్రామాన్ని సందర్శించారు. నిర్మాణంలో ఉన్న కల్వర్టు పనులను పరిశీలించారు. దుర్ఘటనకు గల కారణాలను పరిశీలించారు. అందుకు సంబంధించి వివరాలను కల్యాణ సింగుపూర్ బీడీవో సునీల్ ఖొరాను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాధిత కుటుంబాలను పరామర్శించారు. పూర్తిస్థాయిలో దర్యాప్తు నిర్వహించి దోషులపై చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని తెలియజేశారు. అదేవిధంగా నిర్మాణ దశలోనే ఆగిపోయిన తొలొసాజ్జ నుంచి ఉపారొసాజ్జా గ్రామానికి అనుసంధానించే రహదారి పనులు, కల్వర్టు నిర్మాణ పనులు పూర్తి చేయాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. పర్యటనలో తహసీల్దార్ సుధాకర్ రైతా తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా గుమ్మా పోటీలు



పోటీలో ప్రతిభ కనబరుస్తున్న యువకుడు

పర్లాకిమిడి: పట్టణంలోని రెండోవార్డు ఒడియా డెప్పవీధిలో గుమ్మా పోటీలు బుధవారం ఉత్సాహంగా నిర్వహించారు. వీధిలో యువకులు బహుమతులు దక్కించుకోవడానికి పోటీపడ్డారు. ఎవరైతే గుమ్మకు పది అడుగుల ఎత్తులో ఉన్న కొబ్బరికాయ, జొన్నపొత్తులు కొడతారో వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా వెండి, బంగారం, మిక్సీలు అందజేస్తుంటారు. జంధ్యాల పౌర్ణమినే గుమ్మా పౌర్ణమిగా ఈ ప్రాంతంలో పిలుస్తుంటారు.

రెండు మావో డంప్‌లు స్వాధీనం



మావోలు అమర్చిన టిఫిన్ బాంబ్‌లు



డంప్‌లో లభ్యమైన తుపాకీలు, జిలెటిన్ స్టిక్స్



డంప్‌ను గుర్తిస్తున్న జవాన్లు



డంప్ స్వాధీనం చేసుకున్న 142వ బెటాలియన్ జవాన్లు

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి గంపకొండ పంచాయతీ మరిగేట, టేక్‌గూడ గ్రామ సమీపంలోని అడవిలో 142 బెటాలియన్ బీఎస్‌ఎఫ్ జవాన్లు మావోయిస్టుల డంప్‌ను స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం కూంబింగ్‌కు వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో అడవిలో జవాన్లు టార్గెట్‌గా ఏర్పాటు చేసిన డంప్‌ను గుర్తించి వెలికితీశారు. అందులో మూడు టిఫిన్ బాంబులు, 110 జిలిటెన్ స్టిక్స్, రెండు ఎస్వీ ఎంఎల్ రైఫిల్స్, రెండు డిటోనేటర్లు ఉన్నాయి. అలాగే చిత్రకొండ సమితి జోడాంబ్ పంచాయతీ తాబేరు గ్రామ సమీపంలోని అడవిలో 177 బెటాలియాన్ బీఎస్‌ఎఫ్ జవాన్లు బుధవారం ఒక డంప్ స్వాధీనం చేసుకున్నారు. ఈ డంప్‌లో 6 జిలెటిన్ స్టిక్స్, 1 టిఫిన్ బాక్స్ బాంబ్, 2 ప్లాటిక్ బాక్స్‌లు, 30 మీటర్ల కరెంట్ వైరు స్వాధీనం చేసుకున్నారు. మావోయిస్టులు ఎన్ని ఎత్తులు వేసినా సాగవని జవాన్లు హెచ్చరించారు.

మత్తులో మానవత్వం చిత్తు

- స్వామీ వివేకానంద విగ్రహం ధ్వంసం చేసిన యువకులు
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన
- యువకుల దుశ్చర్య వీడియో వైరల్

పొందూరు: ఒంటిపై ఒక్కరికీ సోయి లేదు. చుట్టుపక్కల ఏం జరుగుతోంది, తాము ఏం చేస్తున్నామో తెలీదు. మత్తులో జోగుతూ సమాజం ఛీ కొట్టేలా దుశ్చర్యకు పాల్పడ్డారు. యువతే దేశ భవిష్యత్ అని గొంతెత్తి చెప్పిన స్వామీ వివేకానందుడి విగ్రహాన్ని ధ్వంసం చేసి అపచారానికి పాల్పడ్డారు. ఆరు నెలల కిందట జరిగిన ఈ ఘటన తాలూక వీడియో ఇప్పుడు వైరల్‌గా మారింది. వీడియోలో యువకులు ప్రవర్తించిన వైఖరి చూసి వీక్షకులంతా మండిపడుతున్నారు. మత్తు పదార్థాలను సేవించిన యువకులు ఆ మత్తులో పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉన్న వివేకానంద స్వామి విగ్రహాన్ని ధ్వంసం చేశారు. తాజాగా బయటకు వచ్చిన వీడియో ప్రకారం పొందూరుకు చెందిన ఓ వ్యక్తి అతని స్నేహితులు మత్తు పదార్థాలను సేవించి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న వివేకానంద స్వామి విగ్రహాన్ని కర్రతో కొడుతూ, విగ్రహంపై నమిలిన గుట్కా ఊస్తూ, ఇసుకను వేస్తూ, విగ్రహంతో మాట్లాడుతూ వికార చేష్టలు చేశారు. అంతటితో ఆగకుండా విగ్రహాన్ని తొలగించి రోడ్డుపై పడేశారు. ఇదంతా పలువురు యువకులు చూస్తూ ప్రోత్సహిస్తూ వీడియోలు తీశారు. దీనిపై అప్పట్లో పాఠశాల సిబ్బంది పోలీసులకు సమాచారం ఇవ్వలేదు. ఇప్పుడు వీడియో బయటపడడంతో ఇన్‌చార్జి హెచ్‌ఎం కె.ఈశ్వరరావు ఆచారీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్‌ఐ ఎస్.లక్ష్మణరావు తెలిపారు. ఈ ఘటనలో మొత్తం 11 మందిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.



వివేకానంద విగ్రహంపై గుట్కా ఊస్తున్న యువకుడు

గోమాతను కాపాడారు

కాశీబుగ్గ: కడుపు నిండా ప్లాస్టిక్ కవర్లను మింగేసిన గోమాతను స్థానికులు కాపాడారు. పలాస ఆర్టీసీ కాంప్లెక్స్ పరిధిలో బుధవారం ఓ ఆవు కడుపు నిండా ఆహార పదార్థాలతో పారేసిన కవర్లను తిని ఒరిగిపోయింది. దీంతో వెంటనే అక్కడున్న లేబర్లు, విద్యార్థులు స్పందించి రిక్షాపై గోవును సురక్షిత ప్రాంతానికి తరలించారు. అనంతరం వైద్యులను పిలిపించి సెలైన్ బాటిల్ ఎక్కించి వైద్య సేవలు అందించారు.

క్లుప్తంగా

ఇస్రోలో అప్రెంటిస్‌కు ప్రభుత్వ ఐటీఐ విద్యార్థి



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రవికుమార్

సాలూరు: పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో చదివిన విద్యార్థి ఇస్రోలో అప్రెంటిస్‌షిప్‌కు ఎంపికయ్యాడని కళాశాల ప్రిన్సిపాల్ రవికుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ మండలంలోని చీపురువలస గ్రామానికి చెందిన ఎస్.యుగంధర్ 2019-21 విద్యాసంవత్సరంలో కళాశాలలో రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండిషనింగ్ ట్రేడ్ చదివాడన్నారు. తమ విద్యార్థి అప్రెంటిస్‌కు ఎంపికైనట్లు ఇస్రో నుంచి లేఖ అందిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి యుగంధర్‌ను ప్రిన్సిపాల్ రవికుమార్ ,సిబ్బంది రంభ శ్రీషణ్ముఖ్ తదితరులు బుధవారం అభినందించారు. జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

సెప్టెంబర్ 2న జీడి పిక్కల వేలం

పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లా అటవీశాఖ పరిధిలో సెప్టెంబర్ 2న 1600కిలోల జీడి పిక్కల వేలం నిర్వహించనున్నామని జిల్లా అటవీశాఖాధికారి జీఏపీ ప్రసూన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలకొండ డివిజన్ వండువ గ్రామంలో 2023 సీజన్‌కు సంబంధించి 60హెక్టార్ల విస్తీర్ణంలో 1600కిలోల జీడి పిక్కలు వేలం ద్వారా విక్రయానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. ఆసక్తిగల వారు పార్వతీపురం అటవీశాఖ కార్యాలయంలో సెప్టెంబర్ 2న నిర్వహించే వేలంలో పాల్గొనాలని కోరారు.

లారీ ఢీకొని మహిళకు గాయాలు

రాజాం సిటీ: స్థానిక మెయిన్ రోడ్డులో బుధవారం జరిగిన ప్రమాదంలో రేగిడి మండలం పెదశిర్లాం గ్రామానికి చెందిన సంచాన పార్వతి గాయాలపాలైంది. దీనికి సంబంధించి సీఐ కె.రవికుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తమ్ముడు రెడ్డి దుర్గారావుతో కలిసి పెళ్లి సామగ్రి కొనుగోలు చేసేందుకు ద్విచక్రవాహనంపై పార్వతి రాజాం వస్తుండగా సంపత్ భవన్ ఎదురుగా వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొంది. దీంతో ఆమె రోడ్డుపై పడిపోవడంతో నడుముకు బలమైన గాయాలయ్యాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

రోడ్డెక్కిన..ఎడారిఓడ



రోడ్డుపై ఒంటెతో సర్కస్ యజమాని

రేగిడి: ఎడారి ఓడగా పేరున్న ఒంటె రోడెక్కింది. రాజస్థాన్‌కు చెందిన ఓ సర్కస్ కుటుంబం ఒంటెతో పాటు ఊరూరా తిరుగుతూ సర్కస్ ప్రదర్శనలు ఇస్తూ, ఒంటె పాలు విక్రయిస్తూ జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో బుధవారం మండలంలోని ఉంగరాడ మెట్ట నుంచి రాజాం వైపు వెళ్తున్న ఒంటెను సాక్షి క్లిక్‌మనిపించింది.

హత్యకేసులో నిందితుడికి రిమాండ్

రాజాం సిటీ: మండల పరిధి గురవాం గ్రామానికి చెందిన గొర్లె నారాయణరావుపై ఈ నెల 29న కత్తితో దాడిచేసిన వ్యక్తికి కోర్టు 14 రోజులు రిమాండ్ విధించిందని సీఐ కె.రవికుమార్ బుధవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. నారాయణరావుకు చెందిన వాటర్ ప్లాంట్‌లో బూరాడ గ్రామానికి చెందిన సీమల గణపతిరావు కుటుంబ సభ్యులు పనిచేసేవారు. కొద్దిరోజుల క్రితం వారిని పనిమాన్పించడంతో గణపతిరావు కుటుంబపోషణ ఇబ్బందిగా మారింది. దీంతో గణపతిరావు కోపోద్రిక్తుడై నారాయణరావుపై దాడికి పాల్పడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు గణపతిరావును అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపర్చినట్లు సీఐ రవికుమార్ చెప్పారు.

త్వరగా జీజీఎంపీ పనులు చేయాలి



మండల అధికారులతో సమీక్షిస్తున్న ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్

పార్వతీపురం: గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరు చేసిన పనులను వేగవంతం చేయాలని పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సి. విష్ణుచరణ్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరు చేసిన పనుల ప్రగతిపై పార్వతీపురం, కొమరాడ మండల అధికారులతో ఐటీడీఏ కార్యాలయంలో బుధవారం ఆయన సమీక్షించారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరు చేసిన పనులకు బిల్లులు వెంటనే చెల్లింపు జరుగుతోందని ఈ సందర్భంగా చెప్పారు. . గ్రామాల్లో ఆయా పనుల ప్రాధాన్యం ఉందని, ఈ మేరకు పనులను వేగవంతం చేయాలని సూచించారు. మెటీరియల్ సరఫరా, ఇతర అంశాలపట్ల స్పష్టమైన కార్యాచరణ ఉండాలని స్పష్టం చేశారు. వర్షాలకు ముందుగానే పనులు పూర్తి కావాలని పేర్కొన్నారు.

ఇందుగలదందు లేదని..!

శిశువు తల్లి గర్భంలో ఉన్నప్పుడు తల్లీబిడ్డల ఆరోగ్యానికి అండ..బిడ్డ భూమిమీదకు వచ్చిన నుంచి ప్రయోజకులుగా మారేవరకు ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తోంది. అన్నింటా సాయం చేస్తోంది. విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాట వేసేలా చదువు ప్రణాళికలు అమలుచేస్తోంది. సంక్షేమ పథకాలతో అండగా నిలుస్తోంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయి అవకాశాలు అందిపుచ్చుకునేలా తీర్చిదిద్దుతోంది. ఒక వ్యక్తి శిశువు నుంచి ప్రయోజకుడిగా మారేవరకు ప్రభుత్వం అందిస్తున్న సాయానికి 'సాక్షి' అక్షరరూపం.

- అన్ని వర్గాలకు అన్నింటా అండగా నిలుస్తున్న ప్రభుత్వం
- శిశువు..గర్భంలో ఉన్న నుంచి ప్రయోజకులయ్యేవరకు ప్రభుత్వం సాయం
- విద్యార్థుల భవిష్యత్తుకు గట్టిపునాది
- జాతీయ, అంతర్జాతీయ అవకాశాలు జ అందిపుచ్చుకునేలా విద్యాప్రణాళిక
- అన్నివర్గాల సంక్షేమానికి కృషి

విజయనగరం డెస్క్: శిశువు తల్లిగర్భంలో ఉన్నప్పుడు నెలనెలా వైద్యపరీక్షలు..ఉచితంగా మందుల పంపిణీ, సుఖ ప్రసవం కోసం ప్రభుత్వాస్పత్రుల్లో చక్కని ఏర్పాట్లు.. ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యే సమయంలో దారి ఖర్చులకు రూ.5,000 సాయం..తల్లీబిడ్డలకు అంగన్‌వాడీ కేంద్రాల నుంచి ఆరోగ్యకర ఆహారం సరఫరా.. పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్య.. పాఠశాల స్థాయిలో ఆంగ్లమాధ్యమంలో చదువులు.. జగనన్న విద్యాకానుకల రూపంలో అభ్యసన సామగ్రి సరఫరా.. జగనన్న గోరుముద్ద కింద రుచికరమైన ఆహారం... అమ్మఒడి కింద ఆర్థికసాయం, ఉన్నత చదువులుకు జగన్న విద్యాదీవెన, వసతిదీవెన, విదేశీ విద్యాదీవెన.. ఇలా.... ఒకటేమిటి... విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు ప్రభుత్వం చక్కని దారిచూపుతోంది. ప్రతి శిశువు ఓ మంచి ఆరోగ్యకర పౌరుడిగా ఎదిగేందుకు అవసరమైన సాయం అన్నిచోట్లా అందజేస్తోంది. వివిధ వర్గాల సంక్షేమానికి ఆర్థిక సహకారం చేస్తూ భరోసా కల్పిస్తోంది. రాష్ట్రాన్ని అన్నింటా మేటిగా నిలుపుతోంది.

అమ్మఒడి లబ్ధి ఇలా...		
విజయనగరం జిల్లా...		
విద్యాసంవత్సరం	లబ్ధిదారుల సంఖ్య	లబ్ధి మొత్తం (రూ.కోట్లలో)
2019-2020	1,73,460	260.19
2020-21	1,63,146	244.71
2021-22	1,73,440	260.16
2022-23	1,66,180	249.27
పార్వతీపురం మన్యం జిల్లా		
2019-20	1,49,041	125.73
2020-21	1,34,708	112.33
2021-22	1,23,335	129.61
2022-23		

జగనన్న విద్యాదీవెన పథకం 2023 ఏప్రిల్-జూన్ త్రైమాసికానికి ఆర్థిక ప్రయోజనం ఇలా..		
జిల్లా	విద్యార్థుల సంఖ్య	లబ్ధి (రూ.కోట్లలో)
విజయనగరం	43,900	29.44
పార్వతీపురం మన్యం	19,636	12.92



గర్భిణులకు ఆరోగ్య భరోసా..



ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఆస్పత్రి రికార్డుల ప్రకారం ప్రస్తుతం 15,384 మంది గర్భిణులు ఉన్నారు. వారందరికీ ప్రభుత్వం వైఎస్సార్ సంపూర్ణ పోషణ, వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ పథకాల కింద ఆరోగ్యకర ఆహారం నెలనెలా ఇంటికే సరఫరా చేస్తోంది. 'ఫ్యామిలీడాక్టర్'తో ఊరిలోనే వైద్యపరీక్షలు చేస్తూ..అవసరమైన మందులు ఉచితంగా అందజేస్తోంది. రక్తహీనతతో బాధపడేవారికి మెరుగైన వైద్యసేవలు కల్పిస్తోంది. సుఖప్రసవాలను ప్రోత్సహిస్తోంది. ప్రసవ తేదీకి ముందుగానే ఆస్పత్రుల్లో చేరుస్తూ మెరుగైన వైద్యం అందించి తల్లీబిడ్డలను 102 వాహనంలో సురక్షితంగా ఇంటికి అప్పగిస్తోంది. 1

పిల్లలకు ఆరోగ్యకర విద్య



మూడేళ్ల నుంచి ఐదేళ్ల వయస్సు ఉన్న పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో కూడిన విద్యను బోధిస్తోంది. ఆరోగ్యంగా ఎదిగేందుకు నెలనెలా వైద్యపరీక్షలతో పాటు కోడిగుడ్డు, పాలు, పప్పు, ఆకుకూరలతో కూడిన భోజనం వడ్డిస్తోంది. రోజుకో మోనూతో రుచికరమైన భోజనం అందిస్తోంది. ఉమ్మడి విజయనగరం జిల్లాలో 5 ఏళ్ల లోపు పిల్లల సుమారు 1,25,000 మంది అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యనభ్యసిస్తున్నారు. 2

'పాథమిక' విద్యపై ప్రత్యేక శ్రద్ధ



ప్రాథమిక దశలోనే విద్యార్థుల భవిష్యత్తుకు గట్టి పునాదివేసేలా రాష్ట్రప్రభుత్వం విద్యాసంస్కరణలు అమలుచేస్తోంది. మూడో తరగతి నుంచి సబ్జెక్టు టీచర్లతో బోధన అందిస్తోంది. అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు అవసరమైన ఆంగ్లమాధ్యమంలో పట్టుసాధించేలా బోధన ప్రణాళికను అమలుచేస్తోంది. పేదరికంతో ఏ ఒక్క విద్యార్థి చదువుకు దూరంకాకూడదన్న ఉద్దేశంతో 'జగనన్న అమ్మ ఒడి' కింద ఏటా రూ.15000లు ఆర్థిక సాయం అందిస్తోంది. జగనన్న విద్యాకానుక కింద సమస్త విద్యాభ్యాసన సామగ్రి సమకూరుస్తోంది. జగనన్న గోరుముద్ద కింద రుచికరమైన భోజనం వడ్డిస్తోంది. నాడు-నేడుతో సరస్వతీనిలయాలకు సకల సదుపాయాలు కల్పిస్తోంది. 8వ తరగతి నుంచి డిజిటల్ చదువులు ప్రోత్సహించేలా ట్యాబ్‌లు అందజేస్తోంది. ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్(ఐఎఫ్‌టీ), స్మార్ట్ టీవీల సాయంతో డిజిటల్ తరగతులు అందుబాటులోకి తెచ్చింది. పదోతరగతిలో ప్రతిభ చూపే విద్యార్థులను జగనన్న ఆణిముత్యాలు అవార్డులతో సత్కరిస్తోంది. చదువుకు ఆర్థిక కష్టాలు దూరం చేస్తోంది. 3

ఉన్నత విద్యకు పూర్తిఫీజు రీయింబర్స్‌మెంట్



విద్యార్థుల ఉన్నత చదువుకు ప్రభుత్వం ఆర్థిక సాయం చేస్తోంది. ప్రభుత్వ, కార్పొరేట్ కళాశాలల్లో చదువుకునే పేద కుటుంబాల విద్యార్థులకు జగనన్న విద్యాదీవెన కింద పూర్తి ఫీజురీయింబర్స్‌మెంట్ అందిస్తోంది. ఇటీవల ఏప్రిల్-జూన్ త్రైమాసికానికి విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని 63,536 మంది విద్యార్థులకు జగనన్న విద్యాదీవెన కింద రూ.42.32 కోట్లు విడుదల చేసింది. ఉన్నత చదువులకు ఆర్థిక కష్టాలు దూరం చేస్తోంది. జగనన్న వసతి దీవెన కింద హాస్టల్‌బిల్లులు చెల్లిస్తోంది. 4

విదేశీ చదువుకు సాయం

జగనన్న విదేశీ విద్యాదీవెన కింద ప్రభుత్వం సాయం అందిస్తోంది. ప్రపంచంలోని మొదటి 300 ర్యాంకింగ్ కళాశాలల్లో సీట్లు పొందిన విద్యార్థులకు వర్సిటీ, చదువును బట్టి ఒక్కోవిద్యార్థికి రూ.కోటి 25లక్షల వరకు సాయం అందిస్తోంది. 5

ఉద్యోగ వరం

వివిధ ప్రభుత్వరంగ శాఖల్లో ఖాళీలు భర్తీ చేస్తోంది. సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టి పార్వతీపురం, విజయనగరం ఉమ్మడి జిల్లాలోని సుమారు 6,000 మంది నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించింది. కాంట్రాక్ట్ అధ్యాపకులు, వివిధ శాఖల్లో పనిచేసిన కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించడంతో వారి జీవితాల్లో వెలుగులు ప్రసరిస్తున్నాయి. 6

ఉపాధి కల్పిస్తున్న స్కిల్ హబ్‌లు



గతంలో డిగ్రీవిద్యను పూర్తిచేశాక పీజీ సీటు రాకుంటే చదువు ఆగిపోయేది. ఇప్పుడు.. ప్రభుత్వం నియోజకవర్గానికో స్కిల్‌హబ్‌ను ఏర్పాటుచేసి నిరుద్యోగులకు వివిధ కంపెనీ అవసరాలకు అనుగుణంగా శిక్షణ ఇస్తోంది. నిపుణులైన మానవ వనరులను తయారుచేసి కంపెనీలే కాళ్లదగ్గరకు వచ్చి ఎంపిక చేసుకునే వ్యవస్థను అందుబాటులోకి తెచ్చింది. నిరుద్యోగులకు విరివిగా ఉద్యోగ అవకాశాలు లభిస్తుండడంతో పేద కుటుంబాల్లో ఆర్థిక వెలుగులు ప్రసరిస్తున్నాయి. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని స్కిల్‌హబ్‌లలో శిక్షణ పొందిన సుమారు 3,000 మంది నిరుద్యోగులు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించారు. 7



అన్నివర్గాలకూ సంక్షేమం

రైతుల సాగుకు వైఎస్సార్ రైతుభరోసా-పీఎం కిసాన్ కింద ఏటా రూ.13,500 పెట్టుబడి సాయం, ఆర్‌బీకేల నుంచి విత్తనం నుంచి పంట కొనుగోలువరకు ఊరిలోనే అందుబాటులోకి వచ్చిన సేవలు, మహిళల స్వయం ఉపాధికి వడ్డీలేని రుణాలు, వివిధ పథకాల కింద ఆర్థిక చేయూత, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు తక్కువ ధరకే భూముల కేటాయింపులు, విద్యుత్ రాయితీలు, చిరువ్యాపారులకు ఏటా రూ.10వేలు చొప్పున వడ్డీలేని రుణం, ఆటోడ్రైవర్లకు వాహన మిత్రకింద ఆర్థిక చేయూత.. ఇలా అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం సహకరిస్తోంది. ఆర్థిక ప్రగతికి అండదండలు అందిస్తూ రాష్ట్రాన్ని దేశంలోనే ముందువరసలో నిలుపుతోంది.

మాతా శిశుసంక్షేమానికి ప్రాధాన్యం

మాతా, శిశు సంక్షేమానికి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోంది. వైఎస్సార్ సంపూర్ణ పోషణ, వైఎస్సార్ సంపూర్ణ ప్లస్ పథకాల ద్వారా గర్భిణులు, బాలింతలకు పోషక విలువలతో కూడిన పౌష్టికాహారాన్ని అందిస్తోంది. రక్తహీనత, పౌష్టికాహారం లోపం నివారణకు ఇవి దోహదపడుతున్నాయి.

– బి.శాంతకుమారి,
జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారత అధికారిణి

పిల్లల భవిష్యత్తుపై బెంగలేదు..



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనలో పిల్లల భవిష్యత్తుపై బెంగలేదు. ఆహారం నుంచి ఆరోగ్యంవరకు.. పుస్తకాల నుంచి చదువు ఖర్చుల వరకు సమస్తం ప్రభుత్వమే సమకూర్చుతోంది. పేద కుటుంబాలవారంతా పిల్లలను చదివించేందుకు ముందుకు వస్తున్నారంటే అది జగనన్న ఇస్తున్న ధైర్యమే.

– బొత్స రాధాకుమారి, విద్యార్థి తల్లి, పార్వతీపురం

అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం



మా బాబు చాలా తక్కువ బరువు ఉండేవాడు. మొదటి సంవత్సరం మా అబ్బాయి బరువు 8 కేజీలు ఉండేవాడు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇస్తున్న పౌష్టికాహారం, బాలామృతం, పాలు తదితర పౌష్టికాహార వస్తువులను ఇవ్వడంతో ఇప్పుడు మా అబ్బాయి ఏడాదిన్నర కాలంలో 11కేజీల బరువు పెరగడంతో పాటు పూర్తి ఆరోగ్యంగా ఉన్నాడు. మా లాంటి తల్లుల తరపున ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు.

– దివ్య, పాలకొండ మండలం

వేగవంతంగా కేసుల దర్యాప్తు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్



ఏఎస్పీ సునీల్ షరోన్‌కు ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎస్పీ

పార్వతీపురంటౌన్: కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేయాలని పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అధికారులతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీసు స్టేషన్‌లో నమోదైన గ్రేవ్, నాన్‌గ్రేవ్ కేసులను సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రత్యేక కార్యచరణతో కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. గంజాయి, సారా రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులతో కలిసి సంయుక్తంగా దాడులు నిర్వహించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఓపెన్ డ్రికింగ్, డ్రంకెన్ డ్రైవ్ విధిగా నిర్వహించాలని, ప్రమాదాలు సంభవించే ప్రాంతాల్లో వాహన దారులను అప్రమత్తం చేస్తూ సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతిభ కనబర్చిన అధికారులకు ప్రశంసాపత్రాలు సారిపల్లిలోని పోలీసు శిక్షణ కేంద్రంలో నిర్వహించిన అర్ధ సంవత్సర ఫైరింగ్ ప్రాక్టీస్‌లో జిల్లా అధికారులు పాల్గొనగా డిస్ట్రిక్ట్ స్పెషల్ బ్రాంచ్ సీఐ సీహెచ్ లక్ష్మణరావు ప్రథమ స్థానం, డీసీఆర్బీ ఎస్సై వి.పాపారావు ద్వితీయ స్థానం, పార్వతీపురం ఏఎస్పీ సునీల్ షారోన్ తృతీయ స్థానంలో నిలవగా వారిని ఎస్పీ అభినందించి ప్రశంసాపత్రాలను అందజేశారు. అదే విధంగా పోలీసు విధులు సమర్థంగా నిర్వహించి కేసుల పురోగతిలో ప్రతిభ కనబరిచిన పాలకొండ సీఐ కె.మురళీధర్, సాలూరు సీఐ శ్రీనివాస రావు, పాచిపెంట ఎస్సై ఫక్రుద్దీన్, హెచ్‌సీ కె.పరసన్న, డబ్ల్యూపీసీ పి.జయ, ఎల్విన్‌పేట పీసీ సీఎచ్.హేమసుందర్, జి.సురేష్ కురుపాం పీసీ ఎం.రాజేష్, చినమేరంగి హెచ్‌సీ డి.సాంబమూర్తి, పీసీలు ఎం .అప్పన్న, జీవీఎస్ శివప్రసాద్, సాలూరు పీసీ ఎ.వి.రామినాయుడులను ఎస్పీ విక్రాంత్ పాటిల్ అభినందించి, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సమావేశంలో పార్వతీపురం సబ్ డివిజన్ ఏఎస్పీ సునీల్ షరోన్, డీఎస్పీ జీవీ కృష్ణారావు, పాలకొండ సబ్ డివిజన్ ఎస్సీ-ఎస్టీ సెల్ డీఎస్పీ జి.మురళీధర్, బడే వెంకటనాయుడు సెకెండ్ ఏడీజే పీపీ, గొర్లి వెంకటరమణ ఏఎస్‌జే కోర్టు పీపీ పార్వతీపురం, ఎస్బీ సీఐ సీహెచ్.లక్ష్మణరావు, డీసీఆర్‌బీ సీఐ ఎస్.వి.ప్రభాకర రావు, జిల్లా సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు

ఎస్సై, ఆర్ఎస్సై నియామక ప్రక్రియ పర్యవేక్షణ



పరుగు పందెం పర్యవేక్షిస్తున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: ఎస్ఎల్‌పీఆర్‌బీ ఆధ్వర్యంలో విశాఖలోని కైలాసగిరిలో నిర్వహిస్తున్న స్టైపెండరీ క్యాడెట్ ట్రైనీ ఎస్సై/ఆర్ఎస్సైల నియామక ప్రక్రియను ఎస్పీ ఎం.దీపిక బుధవారం పర్యవేక్షించారు. విశాఖ రేంజ్‌కు సంబంధించి ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన 685 మంది మహిళా అభ్యర్థుల దేహ దారుఢ్య పరీక్షలకు గాను 512 మంది హాజరయ్యారని ఎస్పీ ఎం.దీపిక ఈ సందర్భంగా తెలిపారు. అభ్యర్థులు తప్పనిసరిగా పుట్టినతేదీ, కనీస విద్యార్హతలు, కుల ధ్రువీకరణకు సంబంధించిన ఒరిజినల్, జిరాక్స్‌కాపీలను సమర్పించాలని సూచించారు. మొదటిగా అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్స్, బయోమెట్రిక్ పరిశీలన అనంతరం ఎత్తు, బరువుకు సంబంధించి ఫిజికల్ మెజర్‌మెంట్ పరీక్ష నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ, నోడల్ అధికారి దిలీప్ కిరణ్, అనకాపల్లి అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

బడిబయట పిల్లలను గుర్తించండి

- కలెక్టర్ నిషాంత్‌కుమార్



వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: బడి బయట ఉన్న పిల్లలను గుర్తించాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. స్థూల నమోదు నిష్పత్తి (గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో) సర్వేపై మండల పరిషత్ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 2005 సెప్టెంబరు 1వ తేదీ నుంచి 2018 ఆగస్టు 31వ తేదీ మధ్య జన్మించిన పిల్లలు పాఠశాలలో ఉండాలని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. బడి బయట ఉన్న పిల్లల కోసం సర్వే నిర్వహించి తక్షణం నివేదిక సమర్పించాలని ఆదేశించారు. సర్వేను మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు పర్యవేక్షించాలని కోరారు. విద్యాశాఖ నిర్వహించే సర్వేలో ఇతర రాష్ట్రాలకు వెళ్లిన విద్యార్థులు, మృతి చెందిన విద్యార్థులు, కనిపించకుండా ఉన్న విద్యార్థుల వివరాలు ఉంటే నమోదు చేయాలని సూచించారు. గ్రామ, వార్డు సచివాలయం పరిధిలో సంక్షేమ, విద్యా సహాయకులు పర్యవేక్షణచేసి వలంటీర్ల ద్వారా సర్వే పూర్తి చేయాలని చెప్పారు. సర్వేలో వలంటీర్లు విధిగా విద్యార్థుల ఆధార్ సంఖ్య నమోదు చేయాలని, గ్రామంలో ఉన్నప్పటికీ బడి బయట ఉన్న పిల్లల జాబితా, 12వ తరగతి ఉత్తీర్ణులైన వారి జాబితా, ఇతర జిల్లాల్లో చదువుతున్న విద్యార్థుల జాబితా తయారుచేయాలని ఆదేశించారు.

నాణ్యమైన సర్వే చేసిన వారికి ప్రోత్సాహం

బడి బయట ఉన్న వారిని విధిగా బడిలో చేర్పించాలని, వారు నిరంతరం పాఠశాలకు వెళ్లాలని స్పష్టం చేశారు. నాణ్యమైన సర్వే చేసిన వారికి తగిన ప్రోత్సాహం ఉంటుందని చెప్పారు. 2023-24 విద్యా సంవత్సరంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, ఇంటర్మీడియట్ వరకు శతశాతం స్థూల నమోదు నిష్పత్తి జరగాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.ప్రేమ కుమార్, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. రామచంద్ర రావు పాల్గొన్నారు.

ప్రజ్ఞావైకల్య విద్యార్థులకు బోధనోపకరణాలు

- 10 మండలాల్లో 114 మందికి కిట్ల పంపిణీ

విజయనగరం అర్బన్: ప్రజ్ఞా వైకల్య విద్యార్థుల విద్యాభివృద్ధికి బోధనోపకరణాలు దోహదం చేస్తాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సమగ్ర శిక్ష జిల్లా సహిత విద్య సమన్వయకర్త ఎస్.సూర్యరావు సూచించారు. ఈ మేరకు విద్యాశాఖ, సమగ్ర శిక్ష ప్రాజెక్టు ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన జాతీయ మోధో వైకల్య సాధికార సంస్థ సౌజన్యంతో స్థానిక కంటోన్మెంట్ నగర పాలక ఉన్నత పాఠశాలలో బుధవారం రెండోరోజు బోధనోపకరణ పరికరాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. రెండు రోజుల్లో బొండపల్లి, చీపురుపల్లి, డెంకాడ, గజపతినగరం, గంట్యాడ, గరివిడి, గుర్ల, జామి, నెల్లిమర్ల, విజయనగరం మండలాలకు చెందిన 114 మంది దివ్యాంగ విద్యార్థులకు ఒక్కో కిట్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కో కిట్ రూ.10 వేల విలువ చేస్తుందని వాటి వినియోగంపై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కలిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సహ సమన్వయ కర్త ఎం .భారతి, జాతీయ మోధో వైకల్య సాధికార సంస్థ ప్రతినిధులు కె.ప్రవీణ్‌కుమార్, టి.రాకేష్, సహిత విద్య ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



పరికరాలను పంపిణీ చేస్తున్న సమగ్ర శిక్ష అధికారులు

శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

- గురుకుల పాఠశాలల జిల్లా సమన్వయ కర్త



వేపాడ:: గురుకుల పాఠశాలలో భోజనం మెనూ అమలును పరిశీలిస్తున్న జిల్లా సమన్వయాధికారిణి పద్మజ, పక్కనే ప్రిన్సిపాల్ ఫ్లోరెన్స్

వేపాడ: ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినులంతా శతశాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంతో ఉపాధ్యాయినులు బోధన అందించాలని, విద్యార్థులు శ్రమించి లక్ష్యాన్ని చేరుకోవాలని ఏపీ సాంఘిక సంక్షమే గురుకుల పాఠశాలల జిల్లా సమన్వయ కర్త టి.పద్మజ అన్నారు. ఈ మేరకు బుధవారం ఆమె వేపాడ గురుకుల బాలికల పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి ఉపాధ్యాయినులు, విద్యార్థినుల హాజరు, అటల్ టింకరింగ్ రూమ్, గ్రంథాలయాన్ని పరిశీలించారు. అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించి విద్యాబోధన, విద్యార్థుల చదువులపై సమీక్షించారు. ఈ ఏడాది పదోతరగతి, ఇంటర్‌మీడియట్‌లో శతశాతం ఉత్తీర్ణత సాధించాల్సి ఉందని స్పష్టం చేశారు. అనంతరం మధ్యాహ్న భోజనం మెనూ అమలు తీరు పరిశీలించి, విద్యార్థినులతో సహపంక్తి భోజనం చేశారు. మెనూ అమలుతీరు, మరేమైనా సమస్యలున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఫ్లోరెన్స్ తోపాటు ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.